## క్లుప్తంగా

### ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసిన దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. దాదాపుగా 15 ప్రైవేట్ కంపెనీలు అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ . చదువుతో పాటు ప్రతి ఒక్కరిలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. 328 మంది హాజరవ్వగా 140 మంది యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. సెలెక్ట్ అయిన వారికి నియామక పత్రాలు అందజేశామని చెప్పారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వారు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికై 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి మారుతీరెడ్డి, యూనియన్ నాయకులు నరేష్, సుబ్రహ్మణ్యం, గిరి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుల దౌర్జన్యం తగదు

సోమందేపల్లి: కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు న్యాయం జరగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్, ఆ పార్టీ నాయకులు శాంతియుతంగా ఆందోళన చేపడితే టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. శుక్రవారం పాఠశాలను సీపీఎం నాయకులు సందర్శించారు. పాఠశాలలో భోజనంతో పాటు సరైన సదుపాయాలు లేవన్నారు. వార్త కవరేజ్‌కు వచ్చిన విలేకరి ఆంజనేయులు ఫోన్‌ను టీడీపీ నాయకులు బలవంతంగా లాక్కొని పగలు గొట్టడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, నాయకులు వెంకటేష్, నాగభూషణం, రవి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

### నూతన బీఈఓగా రేణుకమ్మ



నూతన బీఈఓను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: నూతన బీఈఓగా రేణుకమ్మ గురువారం బీఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు బీఈఓగా ఉన్న ఇంద్రాణమ్మ బదిలీ కావడంతో నూతన బీఈఓ గా రేణుకమ్మ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇన్‌చార్జ్ బీఈఓ బీఆర్పీ వెంకటేశ్, ఈసీఓ వేణుగోపాలరెడ్డి, అక్షర దాసోహ అధికారి శంకరప్ప, ఆదర్శ విద్యాలయం ఎస్‌డీఎంసీ ప్రకాష్, బేకరి నాగరాజ్ తదితరులు నూతన బీఈఓ రేణుకమ్మను సత్కరించారు.

### మత్స్యకారులకు అండగా ఉంటాం



గొల్లపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి రిజర్వాయర్‌లో 20 లక్షల చేప పిల్లలను వదిలారు. మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాల జీవనోపాధికి అండగా ఉంటామన్నారు.

### డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

పరిగి: డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ వన్నప్ప తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు.



చంద్రగిరిలో రహదారి పక్కన ఉన్న బావి దగ్గర తాత్కాలికంగా రైతు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు



రాంపురం జెడ్పీ హైస్కూల్ సమీపంలో సరైన రక్షణ గోడలు లేని వంతెన

# ప్రమాదం అంచున ప్రయాణం

నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల పక్కన ఉన్న వంతెనలు, బావులు, నీటి గుంటలు, చిన్నా చితక బ్రిడ్జిల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదమని తెలిసినా వాహనదారులు ప్రయాణం చేయక తప్పడం లేదు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు అటుగా వెళ్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రయాణికుల భద్రతను అధికారులు గాలికొదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.

– పెనుకొండ రూరల్:



కురుబవాండ్లపల్లికి వెళ్లే మార్గంలో రక్షణ గోడ లేని వంతెన



తిమ్మాపురం రైల్వేగేటు సమీపంలో రహదారి పక్కనే ఉన్న నీటిగుంట

### భద్రతా చర్యలు చేపట్టాలి



మా గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న వంతెనకు రక్షణ గోడ లేకుండా పోయింది. రాత్రుల్లో అటుగా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే అధికారులు భద్రతా చర్యలు చేపట్టాలి.

– చెన్నకేశవులు, కురుబవాండ్లపల్లి

### బావికి దిమ్మెలు అడ్డుపెట్టాం



మా పొలం పక్కనే రెండు మూడు గ్రామాలకు ప్రధాన రహదారి ఉంది. అధికారులు రోడ్డు నిర్మించినప్పటికీ బావికి రక్షణ గోడ నిర్మించ లేదు. వాహనదారులు రాత్రుల్లో అదుపుతప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదాలను ముందే గుర్తించి తాత్కాలికంగా బావికి సిమెంట్ దిమ్మెలను అడ్డు పెట్టాను.

– వెంకటరాముడు, రైతు, చంద్రగిరి

### చర్యలు చేపడతాం



ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా పనిచేస్తాము. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్డు పక్కన ప్రమాదకరంగా రక్షణ గోడలు లేని వంతెనలపై దృష్టిసారిస్తాం. రక్షణ గోడలు నిర్మించడంతో పాటు ప్రమాద సూచికలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతాము.

– వెంకటరామిరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ

## పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మడకశిర: నియోజకవర్గంలో విత్తన పత్తి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, రైతు విభాగం అధ్యక్షుడు గంగాధరప్ప తదితరులు ఏఓ తిమ్మప్ప, రెవెన్యూశాఖ అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం విత్తన కంపెనీల



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రతినిధులతో మాట్లాడి పత్తి విత్తనాలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేసే విధంగా చూడాలని కోరారు. లేకపోతే ప్రభుత్వమే రైతులు పండించిన పత్తి విత్తనాలన్నీ కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు.

## కొంకల్లులో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామంలో వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 'డెంగీ లక్షణాలతో వ్యక్తి మృతి' అన్న శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు వెంటనే ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కొంకల్లులో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పర్యటించారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి కొళాయిల వద్ద, ట్యాంకుల వద్ద నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం పైప్‌లైన్ లీకేజీలను మరమత్తులు చేపట్టారు. జ్వరం, దగ్గు, జలుబు, ఆయాసం, కీళ్లు, ఒళ్లునొప్పులు ఉన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

## ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

హిందూపురం: ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఉద్యోగులే నడిపించేలా చర్యలు తీసుకోవకోవాలని ఏపీపీటీడీ రీజినల్ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.హిందూపురం ఆర్టీసీ డిపో వద్ద ఏపీపీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి మల్లికార్జున, రీజినల్ అసిస్టెంట్ సెక్రటరీ లక్ష్మి, గ్యారేజ్ ప్రెసిడెంట్ నారాయణ, డిపో నాయకులు రూపేంద్ర, శ్రీనివాసులు, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా రీజియనల్ నాయకులు ఆర్ఎస్.రెడ్డి, సీవీపీ పెద్దన్న తదితరులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10 వేల మంది సిబ్బంది నియామకాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలన్నారు. డిపో అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి సాయి వంశీ, అధ్యక్షులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

### పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

పెనుకొండ: పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపైకి వదలకుండా కట్టడి చేసుకోవాలని, తమ సొంత స్థలాల్లో కట్టి వేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువులు రోడ్లపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, దీనిపై ఫిర్యాదులు కూడా అందుతున్నాయన్నారు. పశువులను రోడ్లపైకి వదిలితే గోశాలకు తరలించడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

## ఆలయాల్లో ఆధ్యాత్మిక పరిమళం

హిందూపురం: పట్టణంలోని నింకంపల్లి రోడ్డులోని ఎల్లమ్మ ఆలయంలో ఆషాఢమాసం పురస్కరించుకుని మూలవిరాట్ ఎల్లమ్మదేవిని శాకంబరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో శాకంబరీదేవిగా అలంకరించి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

**ముదిరెడ్డిపల్లిలో బ్రహ్మోత్సవాలు..**

ముదిరెడ్డిపల్లిలోని రుక్మిణి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమైయ్యాయి. ఆలయంలో మూలవిరాట్ పాండురంగస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను గజవాహనంపై ఊరేగించారు.

అమరాపురం: స్థానిక కోట వీధిలో వెలసిన చౌళమాంబ దేవికి గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాస్ వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు వచ్చి అమ్మ వారికి కుంకుమార్చన చేయించారు.

పరిగి: మండల కేంద్రంలో సప్తమాతృక ఆలయంలో వారాహీ అమ్మవారికి నిర్వహించిన ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. అర్చకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారు శ్రీనవదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



హిందూపురం : శాకంబరిగా ఎల్లమ్మదేవి

## 'పురం'లో టీడీపీకి కాలం చెల్లింది

- వేణురెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ అంటేనే ప్రజలు అసహ్యించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి అన్నారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రూరల్ మండల పరిధిలోని బాలంపల్లికి చెందిన ఆరు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. గుడ్డెప్పగారి బాబన్న, హెచ్ గంగాధర్, నవనీత్‌కుమార్, హరీష్, మద్దిలేటి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్ తదితరులకు వేణురెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ రెడ్‌బుక్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. టీడీపీ నేతల్లో కొందరికే ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితి ఉందని, వారి అరాచకాలను, ప్రజాకంటక పాలనపై విసుగు చెంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారన్నారు. టీడీపీ నుంచి చేరిన వారు మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసినా గుర్తింపు లేదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మింటు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, జంగాలపల్లి రవి, వరుణ్‌రెడ్డి, టౌన్ జనరల్ సెక్రటరీ మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో వేణురెడ్డి

**ఆహ్వానపత్రిక అందజేత**

హిందూపురం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో ఆదివారం రుక్మిణి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నంది సర్కిల్‌లో ఏకాదశంకములు పౌరాణిక నాటిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డిని ఆలయ కమిటీ వారు ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, లేపాక్షి మండల వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, తమూకుంట దేవరాజు, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

**సాగునీటి సమస్యపై 8న రౌండ్‌టేబుల్ సమావేశం**

మడకశిర: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఈనెల 8న ఉదయం 11 గంటలకు సాగునీటి సమస్యపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి సోమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మడకశిర బైపాస్ కెనాల్ ఏర్పాటు, హంద్రీనీవా కాలువ పనుల పూర్తి, అన్ని చెరువులకు కృష్ణా జలాలు నింపడం తదితర అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

హిందూపురం టౌన్: పట్టణ సబ్ డివిజన్ పరిధిలో ముద్దిరెడ్డిపల్లి సెక్షన్‌లోని మణేసముద్రం, కొట్నూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ మహేష్‌కుమార్ తెలిపారు. మరమ్మతుల కారణంగా మణేసముద్రం, మలుగూరు, యం.రంగాపురం, నందమూరినగర్, గొల్లపల్లి, ఊటుకూరు, ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి, కొట్నూరు, కొల్లకుంట, కగ్గల్లు, గుడ్డంపల్లి, యం.బీరేపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

**కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు**

పావగడ: తాలూకాలోని కురుబ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కురుబ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పది, ద్వితీయ పీయూసీ పరీక్షల్లో 85 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈనెల 14 లోగా దరఖాస్తులు అందించాలన్నారు. సంబంధిత పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల నుంచి ధ్రువీకరించిన మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు, మొబైల్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేసిన దరఖాస్తులను పీఎల్ దేవరాజ్ (8105104992) కు స్వయంగా అందించాలని కోరారు.

## సంక్షిప్త సమాచారం

**సందడిగా మొహర్రం**



ఆలూడిలో కొలువు తీరిన పీర్లు

అగళి: మండల పరిధిలోని ఆలూడిలో మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని పీర్లు కొలువుదీరాయి. శనివారం రాత్రి అగ్నిగుండం ఏర్పాటు, ఆదివారం వేకువమున పీర్ల అగ్నిగుండా ప్రవేశం, గ్రామోత్సవం న్విహించిన అనంతరం సాయంత్రం జలధి కార్యక్రమాలు నిర్వహించున్నట్లు ముజవర్లు తెలిపారు.

**మంచి ఆహారపు అలవాట్లే పిల్లలకు ఆరోగ్యం**

హిందూపురం టౌన్: మంచి ఆహారపు అలవాట్లే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేశవులు తెలిపారు. పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలోని లోటస్ పాఠశాలలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు మంచి ఆహారపు అలవాట్లు, జంక్ ఫుడ్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు.

**7న జిల్లా కేంద్రాల్లో నిరసన**

హిందూపురం టౌన్: విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 7న జిల్లా కేంద్రం నిరసన, 10న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రూ.4,200 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలన్నారు.

**గ్రామాల అభివృద్ధికి కృషి**

గుడిబండ: గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో గ్రామీణా అభివృద్ధి దినోత్సవం సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యం, తాగునీరు, విద్య అందించగలిగితే 70 శాతం ప్రజల సమస్యలు తీర్చినట్లేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఈఓఆర్డీ నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ముస్లిం ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతం చేయండి**

మడకశిర: కడప జిల్లా శెట్టిగుంటలో ఈనెల 13న రాష్ట్రస్థాయి ముస్లిం ఐక్యవేదిక సమావేశం జరుగుతుందని ముస్లిం ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు వసీమ్‌బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు అధిక సంఖ్యలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

పరిగి: మండలంలోని శాసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జానకి, చంద్రకళ, నరసప్పను సన్మానించారు. అనంతరం బదిలీపై వచ్చిన పాండురంగప్ప, లక్ష్మీపతి, శ్రీనివాసులును స్వాగతం పలికారు.

రొద్దం: మండల కేంద్రంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు గిరీష్‌స్వామి సేవలు మరువలేనివని వక్తులు పేర్కొన్నారు. గిరీష్‌స్వామిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ జయభాస్కర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

పరిగి: క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని జిల్లా పరీక్షల విభాగపు అసిస్టెంట్ కమిషనర్ లాజరు తెలిపారు. శుక్రవారం ఆయన పరిగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజుతో సమావేశమై విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. అనంతరం ఓపెన్ స్కూల్ కరపత్రాలు విడుదల చేశారు.

### పోరాటయోధుడు అల్లూరి



లేపాక్షి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఉద్యోగులు

సాక్షిబృందం: పోరాట యోధుడు అల్లూరి అని వక్తలు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### సోషల్ మీడియా కార్యకర్తలకు బెయిల్



బెయిల్ పొందిన సోషల్ మీడియా కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

మడకశిర: మండలంలోని గుండుమలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు ప్రసాద్, చంద్రశేఖర్, సోమశేఖర్‌కు శుక్రవారం బెయిల్ మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారన్నారు. వారిని పోలీసులు మడకశిర కోర్టులో హాజరు పరచగా బెయిల్ మంజూరైనట్లు పేర్కొన్నారు. బెయిల్ మంజూరు కావడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ్, మధు, సికిందర్, రంగనాథ్, మాజీ డైరెక్టర్ గగన తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

### 'దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు'

మడకశిర: గుంటూరు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దళితుడైన చీలి సింగయ్యను ముఖ్యమంత్రి చంద్రబాబు కించపరిచేలా కుక్కతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు దళిత జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలతో మాదిగ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయన్నారు. గతంలో కూడా చంద్రబాబు ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అని కించపరిచారన్నారు. ఇప్పటికైనా దళితులను కించపరిచే విధంగా మాట్లాడడం మానుకొని, దళితుల సంక్షేమానికి ప్రాధాన్యతం ఇవ్వాలన్నారు.